క్లుప్తంగా

రామాలయం ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం



నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యులను అభినందిస్తున్న ఎస్‌ఎంఆర్ పెదబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న శ్రీ రామాలయం ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్‌గా కుర్మాని గోవింద్‌తో పాటు పాలకవర్గ సభ్యులు ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌ఎంఆర్ పెదబాబు ముఖ్య అతిథిగా హాజరై నూతన ట్రస్ట్‌బోర్డు ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి అశోక్, మంచెం మైబాబు, కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చాటపర్రులో ఉచిత కంటి వైద్య శిబిరం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో రవి కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారని రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ రవి కిరణ్ డాక్టర్ హేమలత తెలిపారు. చాటపర్రు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగే ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి నరాలు శుక్లాం, నీటికాసులు, నల్ల గుడ్డు మార్పిడిలకు సంబంధించి అత్యాధునిక మిషనరీతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

నేడు జంగారెడ్డిగూడెంలో జాబ్ మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని జంగారెడ్డిగూడెం టౌన్ హాల్‌లో ఈ నెల 20వ తేదీ బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 877 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18-30 సంవత్సరాల మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9666322032, 9652503799, 9642598324 నెంబర్లతో పాటు (కమాండ్ కంట్రోల్ నంబర్స్ - 9988853335, 8712655686, 8790118349ను సంప్రదించాలని సూచించారు.

రోజంతా ముసురు

బంగాళాఖాతంలో అల్పపీడనం



జ్యూట్‌మిల్లు సెంటర్‌లో చిరుజల్లుల్లోనే వాహనాల సందడి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం కారణంగా గత మూడు రోజులుగా నగరంలో వర్షం కురుస్తూనే ఉంది. దీనితో నగరంపై ముసురు ముసుగేసిందని ప్రజలు చర్చించుకున్నారు. ఆదివారం పెద్దగా వాన కురవకపోవడంతో వాతావరణం కొద్దిగా పొడిబారింది. అయితే సోమవారం ఉదయం నిద్ర లేచిన ప్రజలకు వర్షం శుభోదయం పలికింది. అప్పటి నుంచి రాత్రి వరకూ నగరంలో చినుకులు పడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఎక్కడా భారీ వాన కురవకపోవడంతో జన జీవనానికి ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదు. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగాలకు వెళ్లే వారికి సైతం ఎటువంటి ఇబ్బంది లేకుండా వాతావరణం అనుకూలించింది. చిన్నపాటి చినుకులైనా రోజంతా కురుస్తూనే ఉండడంతో వాతావరణమంతా చిత్తడిచిత్తడిగా మారింది. రోడ్డుపై అడుగుపెడదామంటే బురదమయంగా దర్శనమిచ్చింది. సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయంలో కూడా ఇదే తరహాలో చిరుజల్లులు కురిసినా ఇళ్లకు వెళ్లే వారికి ఎటువంటి ఆటంకం కలుగలేదు.

రోజంతా చిరుజల్లులు..

సోమవారం కొద్దిగా కూడా తెరపిలేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉంది. గత శనివారం నుంచి వాతావరణం ఇలానే ఉండడంతో గృహిణులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పిల్లల స్కూల్, కాలేజ్ యూనిఫారం ఉతకాల్సి ఉండడం కొద్ది సమయం కూడా ఎండ లేకపోవడంతో వారి ఇబ్బందులు రెట్టింపయ్యాయి. బయట ఎండ లేకపోవడంతో ఇంటిలోనే తాళ్లు కట్టి ఉతికిన బట్టలు ఆరవేసి ఫ్యాను గాలితో ఆరవేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్యాంకుల్లో నీరు చల్లబడి స్నానాలకు వేడి నీరు తప్పనిసరిగా వాడాల్సి వచ్చింది. ట్యాంక్ నుంచి వచ్చే నీటితో చేతులు కడగాలన్నా తిమ్మెర్లు వచ్చి ఇబ్బందిపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో కుళాయిల ద్వారా వచ్చిన నీరు వాన నీరు కలిసి బురద నీరుగా రావడంతో మహిళలు వంటలు చేయడానికి మంచి నీరు లేక ఇబ్బందిపడ్డారు.



రెయిన్ కోట్ ధరించి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ



చిరుజల్లులు కురుస్తుండడంతో గొడుగుతో వెళ్తున్న వ్యక్తి



టవల్‌కప్పుకుని ద్విచక్రవాహనంపై..

చిత్తడిచిత్తడిగా వాతావరణం

రోజంతా చిరు జల్లులు కురుస్తూనే ఉండడంతో వాతావరణమంతా చిత్తడిచిత్తడిగా మారింది. ఎక్కడ చూసినా బురదమయంగానే కనిపించింది. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనులకు వెళ్లేవారు రెయిన్ కోట్లు, జర్కిన్‌లు వేసుకుని బయటకు వచ్చారు. పాదచారులు గొడుగులు వాడక తప్పలేదు. ఇటువంటి వాతావరణంలో నగరంలోని పలు ప్రాంతాల్లో టీ దుకాణాలు తేనీటి ప్రియుల తాకిడి ఎదుర్కొన్నాయి. అయితే సాయంత్రమయ్యే సరికి నగరంలోని ప్రధాన కూడళ్లలో దర్శనమిచ్చే బజ్జీలు, పునుగుల బండ్లు సోమవారం కనిపించలేదు. జల్లులు పడుతూనే ఉండడంతో వ్యాపారం జరుగుతుందో లేదో అనే అనుమానంతో బండ్లు పెట్టడానికి కూడా చిరు వ్యాపారులు వెనకడుగు వేశారు. దీంతో అక్కడక్కడా పక్కా దుకాణాల్లో ఉన్న చిరుతిళ్ల వ్యాపారులకు లాభసాటిగా మారింది. శని, ఆది వారాల్లో చిరుజల్లులు కురిసినప్పటికీ ఏలూరు అర్బన్, రూరల్‌ప్రాంతాల్లో సున్న మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా సోమవారం మాత్రం ఏలూరు రూరల్‌లో ప్రాంతంలో 8.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఏలూరు అర్బన్ ప్రాంతంలో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

తుది చెల్లింపులు వెంటనే చేయాలి



జెడ్పీ డిప్యూటీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు

ఏలూరు(మెట్రో): ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల తుది చెల్లింపులు వెంటనే చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.రామ్మోహన్, జి.మోహన్‌లు కోరారు. సోమవారం జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేసిన వారు పీఎఫ్ తుది చెల్లింపులకు దరకాస్తు చేసుకున్నారన్నారు. అయితే నాలుగు నెలల నుంచి ఆడిట్ చేయకుండా పెండింగ్‌లో ఉంచడంతో చెల్లింపులు జరగలేదు, వెంటనే తుది చెల్లింపు ఖాతాలను వెంటనే ఆడిట్ చేయించి చెల్లింపులు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు, గుంటూరు శ్రీనివాసరావు, పి.నాగరాజు, జి.రమేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న యువతి ఈనెల 17వ తేదీ ఉదయం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి



నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలో ప్రజాస్వామ్యన్ని ఎన్నికల కమిషన్ నడిరోడ్డులో పాతరేసిందని, రాజ్యాంగాన్ని ప్రజా హక్కులను కాపాడు కోవటానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు అన్నారు. ఏపీపీసీసీ పిలుపు మేరకు ఏలూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ సంఘీభావంతో ఎన్నికల కమిషన్ ఓటర్ లిస్ట్‌లో చేసిన అవకతవకలకు నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఓట్ల దొంగలు - గద్దె దిగాలి అనే నినాదంతో చేపట్టిన నిరసన కార్యక్రానికి మద్దతుగా సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 7 నియోజకవర్గాల కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌లు, ఉన్నమట్ల ఎలిజ, ఆలపాటి నరసింహమూర్తి, మరీదు కృష్ణ, సీపీఐ నాయకుడు బండి వెంకటేశ్వర రావు, తాళ్ళూరి చక్రవర్తి, దండుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమార్‌రాజు

దెందులూరు: ఏలూరు రోడ్డు మొండికోడు, కోటేశ్వర దుర్గాపురం, గుడివాక లంక వంటి ముంపు పొంచి ఉండే గ్రామాల్లో ఏలూరు తహసీల్దార్ జి విజయకుమార్‌రాజు సోమవారం పరిశీలించారు. రెవెన్యూ ఇరిగేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీఆర్‌ఓలను రెండు రోజులు పాటు భారీ వర్షాలు నష్టాలు అధికారులకు సమాచారం సంబంధించి విధులు నిర్వహించాలని ఆదేశించారు.

అక్రమ అరెస్టులు సరికావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నెల్లూరు జిల్లా కారేడులో ఇండోసోల్ కంపెనీకి బలవంతంగా వేలాది ఎకరాల రైతుల భూములను కట్టబెట్టే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా సంఘాలు ఇచ్చిన ఛలో కారేడు పిలుపుపై పోలీసులు నిర్బంధం ప్రయోగించడాన్ని, అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. రవి ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిర్వహించ తలపెట్టిన సభకు వెళ్తున్న సీపీఎం పార్టీ, రైతు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ. శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీ. వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, నెల్లూరు జిల్లా సీపీఎం కార్యదర్శి మూలం రమేష్, ప్రకాశం జిల్లా సీపీఎం కార్యదర్శి ఎస్‌కే మాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, ఇతర సీపీఎం నాయకులు ఉన్నారని తెలిపారు. నిరసన వ్యక్తం చేసేందుకు కారేడు గ్రామం వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మందిని అరెస్టు చేశారని తెలిపారు. అయినా పోలీస్ నిర్బంధాన్ని ఎదుర్కొని, అరెస్టులకు భయపడకుండా కారేడు గ్రామంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభ జరపడం ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు.

పొరుగు వారిని ప్రేమించడమే గొప్ప సేవ



మెర్సీ హోమ్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో పొరుగువారిని ప్రేమించడమే గొప్ప సేవ అని, పేద వారిని ఆదుకోవడంలో ఆత్మ సంతృప్తి లభిస్తుందని ఐసీఎం పీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు అన్నారు. భోగోలుకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ గెడ్డం సత్యం అండ్ సన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం ఏలూరులో ఐసీయం చర్చ్ కృష్ణా గోదావరి డయాసిస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెర్సీ హోమ్స్ విద్యార్థిని విద్యార్థులకు దుప్పట్లు, టీ షర్టులను బిషప్ జాన్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సంస్థ ద్వారా పేద మహిళల వివాహ సమయంలో ఆర్థిక సహాయం చేయడం, విద్యార్థులను అవార్డుల ద్వారా ప్రోత్సహించడం తదితర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గెడ్డం శామ్యూల్, సులోచన, కీర్తికర్, జీనీషా తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ జాన్ మాట్లాడుతూ పొరుగువారిని ప్రేమించడం కన్నా ఈ లోకంలో గొప్ప సేవ లేదని ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మెర్సీ హోమ్స్ సూపరింటెండెంట్ రోజ్ జాన్, వార్డెన్ ఫాదర్ యోగి తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఏలూరు డీఎస్పీ డీ. శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆగస్ట్ 22వ తేదీ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏటా ఆగస్ట్ 16 నుంచి 22 వరకు నిర్వహించే వారోత్సవాలలో భాగంగా సోమవారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా మానవత సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలు అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరూ సాటివారితో సోదరభావంతో మెలిగినప్పుడు శాంతి స్థాపన సాధ్యమౌతుందన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి విద్యార్థులు కృషి చేయాలని, నేటి యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత స్థానాలు చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మానవత కేంద్ర నియంత్రణ కమిటీ జిల్లా ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఏలూరు యూనిట్ అధ్యక్షుడు ఎంఎస్‌ఎంఎస్ కుమార్, మండల ఛైర్పర్సన్ అడుసుమిల్లి నిర్మల, జిల్లా సెంట్రల్ కమిటీ కన్వీనర్ పోలవరపు దేవరత్నాకరరావు, కార్యదర్శి పూర సత్యనారాయణ, కోశాధికారి అల్లూరి మోహిని, ఏలూరు యూనిట్ కన్వీనర్ వాసిరెడ్డి శేషగిరిరావు, డెవలప్మెంట్ కమిటీ కోఛైర్మన్ వల్లూరుపల్లి సాయిసుధ,ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు, సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ కోనేరు సురేష్, ఆదిత్య కళాశాల విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఈవెంట్ యూనియన్ల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొయ్యలగూడెం: ఈవెంట్ యూనియన్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, యూనియన్‌లలోని సభ్యులకు సామాగ్రిని ఉచితంగా అందజేయాలని ఈవెంట్ (సౌండ్ సిస్టం, టిప్ టాప్ డెకరేషన్, లైటింగ్) మండల యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం ఏఎంసీ కార్యాలయం వేదిక మొదటి సమావేశం నిర్వహించారు. . ఉత్సవాల సమయంలో డీజే సౌండ్ సిస్టంలపై ఆంక్షలు విధిస్తున్నారని దీని వల్ల నష్టపోతున్నామన్నారు. వినాయక నవరాత్రులు, దసరా సమయాల్లో మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ శాఖలను కోరారు. పోలవరం, కొవ్వూరు నియోజకవర్గాల యూనియన్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎస్సై వి.చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మట్టా వనజా లక్ష్మి, కొండ వెంకటరమణ (ప్రెసిడెంట్), రాంబ్రహ్మం (సెక్రటరీ), తోట రమణ (కోశాధికారి), యు.విజయ్, వి.సుబ్బారావు, కె.సుబ్బారావు, వాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వృద్ధుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్ర రావు మాట్లాడుతూ 2007 , 2011 చట్టాలు గురించి వివరించారు. వృద్ధులు గౌరవంగా, భద్రతతో జీవించేలా, వారి ప్రాణ, ఆస్తి రక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈనెల 16న జాతీయ వృద్ధుల కొర్కెల దినోత్సవం సందర్భంగా వినతిపత్రం అందించాల్సి ఉండగా, సెలవుదినం కావడంతో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.త్రినాథరావు పాల్గొన్నారు.

లక్కవరంలో తాగునీటి సమస్యతో అవస్థలు



లక్కవరం మసీదు సమీపంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: తాగునీటి కోసం లక్కవరం గ్రామంలోని రెండవ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీన మంచినీటి ట్యాంకుకు సంబంధించిన మోటార్ స్టార్టర్ కాలిపోయింది. దీంతో వెంటనే సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు జోక్యం చేసుకుని కొత్త స్టార్టర్ తెచ్చి మంచినీటి సరఫరా పునరుద్ధరించారు. అయితే ఆ తరువాత మోటార్ కాలిపోయి రెండవ వార్డులోని సుమారు 7 వీధులకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గత మూడు రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది కాలంగా మంచినీటి సమస్య తలెత్తుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ప్రజాప్రతినిధుల జోక్యంతో ఒక మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. అది కూడా మసీదు సెంటర్ వద్ద పెట్టి చుట్టుపక్కల వీధుల్లోని ప్రజలను అక్కడికి వచ్చి నీరు పట్టుకోవాలని చెప్పడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతదూరం నీళ్లు మోయలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	26	బీన్లచిక్కుడు	68
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	20-24	బీట్‌రూట్	38
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	30	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	09
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	06
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	07
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.10	98503	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు

- వ్యాపార కేంద్రాలకు నిలయంగా ధర్మాజీగూడెం బస్టాండ్
- బస్ షెల్టర్‌లోకి రాని బస్సులు
- నదుపాయాలు లేక ప్రయాణికుల అవస్థలు



ధర్మాజీగూడెం రోడ్డుపై వానలో బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

లింగపాలెం: ధర్మాజీగూడెం నుంచే ప్రయాణించే ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు పడుతూ నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న బస్టాండ్ వ్యాపార సంస్థలకు నిలయంగా మారింది. దీనికితోడు బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి చూడాల్సి వస్తోంది. ప్రతినిత్యం ఈబస్టాండ్‌కు సుమారు 4 డిపోలకు చెందిన సుమారు 25 నుంచి 30 బస్సులు వరకు వచ్చి వెళుతుంటాయి. వేలాది మంది ఇక్కడ నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. కానీ బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో రోడ్డుపైనే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వేచి చూడాల్సి వస్తోందని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇక్కడ దూరప్రాంతం నుంచి వచ్చే ప్రయాణికులకు సైతం మురుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చునేందుకు కూడా అనువుగా లేదు. గతంలో ఇక్కడ కంట్రోలర్ ఉన్నప్పుడు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేవి. ప్రస్తుతం ఆయన్ను కూడా తీసివేయడంతో బస్టాండ్ ఆటోల ఆక్రమణలకు గురైంది. ధర్మాజీగూడెంలో కొన్నేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన బస్టాండ్ ప్రారంభోత్సవానికి నోచుకోక నిరుపయోగంగా పడి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.